క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం, మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సెల్ 9959225800 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

రికార్డుల పరిశీలన

రుద్రవరం: మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీ, తిప్పారెడ్డిపల్లె హెల్త్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులను గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గణాంక అధికారి సుజాత సిబ్బందితో కలిసి హెచ్ఎంఐ, ఐఎస్ రిపోర్టులు, ఆర్‌సీహెచ్ పోర్టల్, ఫీల్డ్ రిజిష్టర్లు, గర్భిణుల ఎంసీపీ కార్డులు, ప్రత్యక్ష పరీక్షలు, కౌమార దశలోని బాల బాలికలకు నిర్వహించిన పరీక్షల నమోదు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.బాబు, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు శివకుమార్, జిల్లా డేటా మేనేజర్ లావణ్య, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

బ్యాగులు, బూట్లు మంజూరు

శిరివెళ్ల: మండలానికి స్టూడెంట్ కిట్ కింద విద్యార్థులకు బ్యాగులు, బూట్లు మంజూరయ్యాయని ఎంఈఓ నాగార్జునరెడ్డి గురువారం తెలిపారు. 5,192 బ్యాగులు, 4,955 బూట్లు వచ్చాయన్నారు. వాటిని పాఠశాలలకు అందజేసే ప్రక్రియ మొదలైందని, విద్యార్థులకు ఆయా పాఠశాలలో హెచ్ఎంలు పంపిణీ చేస్తారని చెప్పారు. కిట్‌లో ఇంకా యూనిఫాం రావాల్సి ఉందన్నారు.

డీఎస్సీ వయో పరిమితి పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): 2024 డీఎస్సీ వయోపరిమితి 48 ఏళ్లకు పొడిగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు రఫీ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి డీఎస్సీని జూలై 1న ప్రకటించబోయే నోటిఫికేషన్‌లో ఓసీ అభ్యర్థుల వయోపరిమితిని పొడిగించాలన్నారు. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి టెట్, డీఎస్సీ కోచింగ్‌ల పేరిట భారీగా ఫీజుల దోపిడీకి పాల్పడే అవకాశం ఉందని, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సాపురంలో పారిశుద్ధ్య పనులు

రుద్రవరం: మండలంలోని నర్సాపురంలో గురువారం అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ గ్రామానికి వెళ్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామంలో కలియదిరిగారు. పైప్‌లైన్ లీకేజీ, మురుగు నిల్వలను పరిశీలించారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో లీకేజీకి మరమ్మతులు, మురుగుపై బ్లీచింగ్ పౌడర్, సున్నం,వేస్టు ఆయిల్ చల్లించారు. అనంతరం జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల వద్దకు వెళ్లి విద్యార్థులకు చేతుల శుభ్రత, డయేరియాపై అవగాహన కల్పించారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. గ్రామాల్లో బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు సరికాదని, తక్షణమే వెనక్కి తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుప్పంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ చేస్తామంటూ చెప్పడం దారుణమన్నారు. కూటమికి మాలలు సైతం ఓట్లు వేశారు కాబట్టే అన్ని సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. గతంలో వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టి వేయడాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు


దత్తాత్రేయ స్వామి

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవక్షం క్రింద వెలసిన దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు . తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అదనపు ఎస్ఎస్ ట్యాంక్ వివరాలు అందజేయండి


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం అదనపు ఎస్ఎస్ ట్యాంక్ ఏర్పాటు నివేదికలను అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అమృత్ స్కీం, డయేరియా నియంత్రణపై మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అదనపు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం కోసం గుర్తించిన 150 ఎకరాల స్థల ఫీజుబులిటీని క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించాలన్నారు. గోరుకల్లు నుంచి అప్ కమింగ్ స్కీంల ద్వారా డ్రా చేసుకునే నీటి వివరాలను, తాగునీటి సరఫరా కోసం స్పెషల్ కాంపోనెంట్ కింద మంజూరైన పనులను గురించి, అమృత్ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. డయేరియా నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వచ్చేనెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. జూలై ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచి పెన్షనర్ల ఇంటి వద్దే గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అదే రోజు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఒక్కో ఉద్యోగి 50 గృహాలు చొప్పున కేటాయించామని, అదనంగా ఉద్యోగులు అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థినులను కన్నబిడ్డల్లా చూసుకొని ఆదరించాలని సూచించారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోనున్న జూనియర్ కళాశాల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణితో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూతో పాటు అక్కడి వసతులు, విద్యార్థినుల పట్ల వార్డెన్ చూపుతున్న ఆదరణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని ఆదేశించారు. ఆరోగ్యంగా ఉండేలా చూడాలని, అప్పుడే వారి చదువుకు ఆటంకాలుండవని చెప్పారు. విద్యార్థినులతో మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు.

పింఛన్ల నగదు మంజూరు

శిరివెళ్ల: జూలై నెలలో ఎన్టీఆర్ ఫించన్ భరోసా కింద సామాజిక పింఛన్ల పంపిణీకి నిధులు మంజూరయ్యాయి. మండలంలో మొత్తం 8,108 పింఛన్ల ఉండగా రూ.5.45 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీల వారీగా..శిరివెళ్లకు 2010 పింఛన్లకు గానూ రూ.1.35 కోట్లు మంజూరయ్యాయి. యర్రగుంట్ల 1,240కి రూ.83.63లక్షలు, గోవిందపల్లెకు 1,151 పింఛన్లకు గాను రూ.78.63 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె 548కి రూ.35.87 లక్షలు, బోయలకుంట్లకు 429 పింఛన్లకు రూ. 28.74 లక్షలు, చెన్నూరు 583కు రూ.39.36 లక్షలు, గంగవరం 276కు రూ.17.24 లక్షలు, గుండంపాడు 272కు రూ.18.70 లక్షలు, జీనేపల్లె 366కు రూ.24.96 లక్షలు, కోటపాడు 828కు రూ.54.40 లక్షలు, మహాదేవపురంలో 404కు రూ.27.41 లక్షలు విడుదలయ్యాయి. జూలై 1వ తేదీన గ్రామ సచివాలయాల సిబ్బందితో ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఇంటి వద్దకే పింఛన్

ఉయ్యాలవాడ : జూలై 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయి. మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 3,925 మంది పింఛన్‌దారులు ఉండగా వీరి కోసం ప్రభుత్వం రూ.2,65,34,000 మంజూరు చేసిందన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు మొదటి రోజే ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఒక్కో ఉద్యోగికి 50 మంది లబ్ధిదారులను కేటాయించామని చెప్పారు. సచివాలయాల పరిధిలో సిబ్బంది కొరత ఉన్న చోట అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఒప్పంద ఉగ్యోగులు ద్వారా పంపిణీ చేయిస్తామని తెలిపారు. పింఛన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులకు రసీదుతో పాటు వారికి అందినట్లు సంతకం కూడా తీసుకుంటారని పేర్కొన్నారు. మొదటి రోజు మిగిలిపోయిన పింఛన్లు లబ్ధిదారులు స్థానికంగా లేకపోవడం, ఇతర కారణాల వల్ల ఎక్కడికైనా వెళ్లి ఉంటే 2వ తేదీ సాయంత్రంలోపు పంపిణీ చేస్తామని వివరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఆర్బీకేలో స్టాకు రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ

కొత్తపల్లి: విత్తనాల దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్బీకేల్లో నిలువ ఉన్న ఎరువులను, స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం రైతులతో చర్చించి ప్రస్తుత పంట స్థితిగతులను తెలుసుకున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ


సుగాలి తండా వద్ద నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రుద్రవరం: విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని సుగాలి తండా, చిత్రేనిపల్లె గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన వరి నారుమడులను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వరి నారుమడి యాజమాన్యంలో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు వివరించారు. అగ్గి తెగులు నివారణ, ఎదిగిన నారుమడిలో ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు నివారణకు వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.వ్యవసాయ విస్తరణ అధికారి రాజు,వీఏఏ పవిత్ర ఉన్నారు.

తంగడంచ ఫారం భూములను పేదలకు పంచాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములను పేదలకు పంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం వారు జూపాడుబంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన నీటిముంపు బాధిత కుటుంబాలకు, సెంటు స్థలం లేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఫారం భూములను పంపిణీ చేయాలన్నారు. 45 ఏళ్ల క్రితం వరకు తంగడంచ ఫారం నిరుపయోగంగా ఓ నీటికుంటలా ఉండేదన్నారు. ఆ భూములను తాటిపాడు, 80బన్నూరు, తంగడంచ, మండ్లెం, భాస్కరాపురం గ్రామాలకు చెందిన రైతులు తలా ఎకరం చొప్పున సాగుచేసుకుంటూ ఉండేవారన్నారు. 30ఏళ్ల క్రితం రైతుల నుంచి భూములు లాక్కొని తంగడంచ ఫారం ఏర్పాటుచేశారని తెలిపారు. 1997-98లో తంగడంచ ఫారం భూములను పంపిణీ చేయాలని వామపక్ష పార్టీలు పెద్ద ఉద్యమం చేయగా అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు ఫారం భూములను పంపిణీ చేయటానికి అంగీకరించినప్పటికీ పంపిణీకి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసన్న, సోమప్ప, రాము, లింగన్న, మాభాష, ప్రసాద్, నరసింహ తదతరులు పాల్గొన్నారు.


దొర్నిపాడు శివారులో నిండుగా నీటి కుంట..పక్కనే సాగు చేసిన మినుము పంట

నిండుగా కుంట..

దొర్నిపాడు: తొలకరి వర్షాలు పలకరించడమే కాదు. కుంటలు, చెరువులకు జలకళను తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకం కింద గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఫారంపాండ్స్‌ను తవ్వించింది. వీటిలో నీటిని నిల్వ చేసుకొని పంటల సాగుకు వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించింది. దీంతో కర్షకులు కుంటల తవ్వకాలకు ముందుకొచ్చారు. మండలంలో దాదాపు 40 కుంటలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు కుంటలు నిండుగామారాయి. దీంతో వాటి పరిధిలో పంటలు సాగు చేశారు. ఒకవేళ పంటకు నీటి అవసరం ఏర్పడితే కుంటలోని నీటితో పంటను కాపాడుకుంటామని చెబుతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో అధికంగా మినుము పంట సాగు చేశారు. ఆయా కుంటల పక్కన సాగు చేసిన మినుము పైరు ఆశాజనకంగా ఉంది.

వేలంలో పెరిగిన ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలోని బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం షాపులు, భూముల బహిరంగ వేలం పాటలో ఆలయానికి గత ఏడాది కంటే ఆదాయం లభించిందని ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పరిధిలో రెండు షాపులు ఉండగా గతంలో వీటికి నెలకు రూ.1800 అద్దె ఉండగా, కొత్తగా వేలం పాటల్లో నెలకు రూ.7700 పలికాయన్నారు. అలాగే ఆలయానికి సంబంధించిన 27.34 ఎకరాలకు గత ఏడాది వేలం పాటల్లో రూ.2.20 లక్షలు లభించగా.. ప్రస్తుతం రూ.3.40 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గతేడాదికన్నా రూ.1.20లక్షలు ఎక్కువగా ఆదాయం లభించింది. ఆలయ సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై చేతి పంపు!


కొండాపురంలో నడిరోడ్డుపై చేతిపంపు వేసిన దృశ్యం

దొర్నిపాడు: కొన్ని పనులు చిత్రంగా అనిపిస్తుంటాయి. మరోసారి చేసిన వారు ఇలా ఎలా ఆలోచించారు.. అనేలా ఉంటాయి. ఈ కోవలోకే వస్తుంది దొర్నిపాడు మండలంలోని కొండాపురం గ్రామంలోని ఓ వీధిలో వేసిన చేతిపంపు. ఇక్కడ రోడ్డుకు మధ్యలో బోరు వేసి చేతి పంపు బిగించారు. ఇది ఇప్పుడు వేసింది కాదండోయ్.. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం వేసిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలా ఎందుకు వేశారో తమకు తెలియదని వారు చెబుతున్నారు. చేతి పంపును చూసినప్పుడు మాక్కూడా ఆశ్చర్యంగా ఉంటుందంటున్నారు. చేతిపంపు రోడ్డుకు మధ్యలో ఉండటంతో మోటార్ సైకిల్ వెళ్లాలన్నా కాస్త జాగ్రత్తగా చూసుకొని వెళ్లాలి. రాత్రి పూట విద్యుత్ లేని సమయంలో పలుమార్లు కొందరు నడిచే క్రమంలో తట్టుకొని పడిన సందర్భాలు అనేకమంటున్నారు. రోడ్డుకు మధ్యలో వేసినా తమ అవసరాలను తీరుస్తుందని పేర్కొంటున్నారు. కాగా.. కొన్నేళ్ల క్రితం వీధిలో సీసీ రోడ్డు వేసే సమయంలో కూడా చేతిపంపును తొలగించకుండా చుట్టూ సిమెంట్ వేసి భద్రంగా చేశారు.

'చిన్నారి చిరునవ్వు'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి

శిరివెళ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో గురువారం చిన్నారి చిరునవ్వు కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. కిల్కారి జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణులు, చిన్నారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రభుత్వం పోర్టల్ ఏర్పాటు చేసిందన్నారు. గర్భిణులు, చిన్నారులను పోర్టల్‌లో రిజిష్టర్ చేసి జాగ్రత్తలపై ఫోన్ల ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు. మాతా శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమన్నారు. డాక్టర్లు ముఖేష్, దివ్య, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి


చిత్రేనిపల్లెలో బాటిళ్లతో నీళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

రుద్రవరం: మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని చిత్రేనిపల్లె గ్రామస్తులు కోరారు. గ్రామంలో 1- 5వ తరగతి వరకు దాదాపు 55 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల గ్రామానికి కొద్ది దూరంలో పొలాల మధ్య ఉంది. అక్కడ సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం లేక అక్కడే బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నారు. ఉదయం పాఠశాలకు వేళ్లే ముందు ఇంటి నుంచి బాటిళ్లతో నీళ్లు తీసుకెళ్తున్నా మధ్యాహ్న భోజన సమయానికి బాటిళ్లు ఖాళీ అవుతుండటంతో భోజనం తరువాత నీటి కోసం బోరును ఆశ్రయించాల్సి వస్తుంది. సురక్షిత వాటర్ లేకపోవడం వల్ల తమ పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని, అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు.

నాణ్యమైన నారుతో మేలైన దిగుబడి

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- గడివేముల మండలంలో 10 వేల ఎకరాల్లో వరి సాగు
- చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే జింకు లోపించే అవకాశం
- నారు నాటేముందు కొనలు విరచాలి


బూజునూరు గ్రామ సమీపంలో వేసిన వరి నారుమడి (ఫైల్)

గడివేముల: రైతులు జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు, దిగుబడిని పొందవచ్చని, నారుమడి యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 10 వేల ఎకరాల దాకా వరి సాగు చేసే అవకాశం ఉంది.

నారుమడి తయారీ ఇలా..

దమ్ము చేసిన నేలలో 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగా పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త వహించాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారు మడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడిని 10 నుంచి 12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేసు కోవాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టినవిత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత పల్చగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగు గుడ్లను కొనల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొనలు విరిచి నాటాలి. దీంతో గుడ్లను నిర్మూలించవచ్చు.

విత్తన మోతాదు..

నాటే పద్ధతిని బట్టి వెదజల్లడానికి 20 నుంచి 25 కిలోలు విత్తనాలను వినియోగించవచ్చు. సాధారణ భూముల్లో 24 నుంచి 30 కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16 నుంచి 30 కిలోలు సరిపోతాయి. విత్తడానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30 నుంచి 36కిలోల అవసరం ఉంటుంది.

విత్తన శుద్ధి..

కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన బెట్టాలి. మరో 24 గంటల పాటు మండీ కట్టి మొలకలను దంప నారుమడిలో చల్లు కోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్త నాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే విత్తనాలు ముందు. మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిపైరిపాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారు మడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు ఆశించకుండా ఉంటాయి.

ఎరువుల సస్యరక్షణ ..

విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.0మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి విత్తనాలపై 10 నుంచి 17రోజుల వరకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

యాజమాన్యం ఇలా..

నారుమడులు పోయాలనుకున్న భూమిలో వేసవి దుక్కులకు ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12 నుంచి 14 రోజులకు, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చని వివరించారు.

8న హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో జూలై 8న హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి గురువారం తెలిపారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో 8వ తేదీ ఉదయం 10 నుంచి 1 గంట వరకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. వివిధ పీఠాల అధిపతులు, గురువులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. హిందువుల ఐక్యత, హిందూ ధర్మ పరిరక్షణ, ఆలయాలు, వాటి ఆస్తుల పరిరక్షణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

కుమారస్వామికి షష్టి పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురు షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.